
రసాయనంపై సమరం

- ఆరోగ్యాన్ని రక్షించుకుందామంటూ దళిత్ పీపుల్ ఫ్రంట్ ముందడుగు
- నేడు అఖిలపక్ష సమావేశం

నగరి : నూలుకు రంగువేసే డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే కలుషిత రసాయన నీరు నగరి మున్సిపాలిటీ, నగరి, నింద్ర, విజయపురం మండలాల వరకు ప్రభావం చూపుతోంది. కుశస్థలి నదిలోను, చెరువుల్లోను, నీటి పారుదల కాలువల్లోను, మురుగునీటి కాలువల్లోనూ రసాయననీరు ఏళ్ల కాలంగా ప్రవహించడంతో భూగర్భ జలాలు సైతం కలుషితమయ్యాయి. చివరకు ఇళ్లలో బోరు వేసుకున్నా ఆ నీటిలో కూడా రసాయన ప్రభావం కనిపిస్తోంది. ఆ నీటిని స్నానానికి వాడితో వెంట్రుకలు రాలిపోతున్నాయి, చర్మంపై దురద పుడుతూ సొరియాసిస్‌కు దారితీస్తోంది. ఆర్సినిక్ కలిసిన ఈ నీటిని తాగడానికి వినియోగిస్తే కిడ్నీ సమస్యలు వస్తున్నాయి, క్యాన్సర్ వ్యాధికి దారితీస్తోంది. దీంతో తప్పనిసరిగా ఇల్లల్లో ఫిల్టర్లు వాడాల్సి వస్తోంది. అలా ఫిల్టర్లు వాడితే కలుషితాలతో పాటు, మినరల్స్ కూడా ఫిల్టర్ అయిపోవడంతో ఆ నీటిని తాగిన వారికి కీళ్లనొప్పులు, మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి. స్థానికంగా ఉన్న నేత కార్మికులకు ఉపాధిలో ఈ డైయింగ్ యూనిట్లు భాగం కావడంతో కఠినమైన చర్యలు తీసుకోవడంలో రాజకీయనేతలు కూడా వెనకడుగు వేస్తూ వచ్చారు. అయితే ప్రస్తుతం స్థానిక నేత కార్మికులకన్నా తమిళనాడులోని పరిశ్రమల కోసం అత్యధిక డైయింగ్ యూనిట్లు పని చేస్తుండటం స్థానిక ప్రజలతో పాటు, నేత కార్మికులకు కూడా ఆగ్రహం తెప్పించింది. మరోవైపు ఈ నీటి కారణంగా పంట భూములు కూడా బీడు బారిపోతుండటం, మున్సిపల్ సమావేశాల్లో కౌన్సిలర్లు డైయింగ్ యూనిట్లపై చర్యలు తీసుకోవాలని ఘోషిస్తున్నా అధికారులు ఏ చర్యలు తీసుకుంటున్నారో స్పష్టత ఇవ్వకపోవడంతో పెల్లుబికిన ఆగ్రహం పోరాటానికి బీజం వేసింది. దళిత్ పీపుల్ ఫ్రంట్ నేతలు ఈ అంశంపై పోరాడేందుకు నడుం బిగించారు. అందరు కలసిరావాలంటూ పిలుపు నిచ్చారు. తమ పోరాటం ప్రాణాలు హరిస్తున్న రసాయన నీటిపై మాత్రమేనని పిలుపునిచ్చారు. దేశమ్మ దేవాలయం సమీపం ఉన్న మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు దళిత్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు ఎ.గజేంద్ర తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, కాంగ్రెస్, ఏఐవైఎస్ సభ్యులు, మైనారిటీ సంఘాలు, మొదలియార్ సంఘాలు, క్రీస్తు సంఘాలు, రైతు సంఘాలు, వ్యాపార సంఘాలు బాధిత ప్రజలకోసం పోరాడడానికి ముందుకు రావాలంటూ జోరుగా కరపత్ర ప్రచారం చేశారు.


కాలువల్లో ప్రవహిస్తున్న రసాయన నీరు


నదిలో ప్రవహిస్తున్న రసాయన నీరు

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికే 'విద్యుత్ అదాలత్'


ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో సమస్యలపై వినతులు అందుకుంటున్న అధికారులు

–చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి

కార్వేటినగరం: విద్యుత్ వినియోగదారులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు విశ్రాంత న్యాయమూర్తి, విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ మాట్లాడారు. జీడీనెల్లూరు, కార్వేటినగరం, నగరి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన ఈ అదాలత్‌కు 8 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటినిపరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. విద్యుత్ సమస్యలు లేని డివిజన్లుగా చేసే దిశగా ట్రాన్స్‌కో అధికారులు ముందుకుపోవాలన్నారు. అనంతరం ఆర్థిక సభ్యులు రామమోహన్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యు లు ఎస్ఎల్. అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, చిత్తూరు జిల్లా పర్యవేక్షకులు ఇస్మాయిల్ అహ్మద్, డీఈ సురేష్ కుమార్, ఏడీఈ చంద్రబాబు(కార్వేటినగరం), వెంకటముని(నగరి), శేషాద్రిరెడ్డి(జీడీనెల్లూరు), ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని అమలు చేయాలి

నగరి: లింగ ఆధారిత హింస నివారణ చట్టాన్ని (పీసీపీఎన్‌డీటీ) సమర్థవంతంగా అమలు చేయాలని డీఎస్పీ మహమ్మద్ సయ్యద్ అజీజ్ కోరారు. పీసీపీఎన్‌డీటీ చట్టంపై మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీతోపాటు ఆర్డీఓ భవాని శంకరి మాట్లాడారు. లింగ ఆధారిత వివక్షను అరికట్టడానికి, మహిళలు, పిల్లల శ్రేయస్సుకు పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు, దాని ప్రాముఖ్యతను వారు తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బాలికల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తే స్కాన్ సెంటర్లు చట్టపరంగా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్కాన్ సెంటర్లు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు నిర్వహించే వారు తప్పనిసరిగా డీఎంహెచ్‌ఓ అనుమతి పొందాలని స్పష్టం చేశారు. నగరి డివిజన్ తమిళనాడు సరిహద్దులో ఉండడంతో లింగ ఎంపిక, గర్భస్రావాల కోసం గర్భిణులు తమిళనాడుకు వెళ్లే అవకాశముందని, అలాగే అక్కడి వారు కూడా ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని, ఇలాంటి కార్యకలాపాలను నిరోధించడానికి ప్రత్యేక నిఘా పెడుతున్నట్టు ప్రకటించారు. ఐసీడీఎస్ అధికారులు ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా, పీహెచ్‌సీ మెడికలాఫీసర్లు, డెమో కె.జయరాముడు, లీగల్ కన్సల్టెంట్ ఇంద్రాణి, సూపర్‌వైజర్లు జనార్ధనం, అమరావతి, బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

విద్యుత్ సమస్యలపై 42 ఫిర్యాదులు


మాట్లాడుతున్న ఈఈ ఆశీర్వాదం

పుత్తూరు: ఎస్పీడీసీఎల్ పుత్తూరు డివిజన్ పరిధిలో రెండవ రోజైన మంగళవారం నిర్వహించిన వినియోగదారుల సమావేశాల్లో 42 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెండింటిని అప్పటికప్పుడు పరిష్కరించిన అధికారులు మిగిలిన వాటిని ప్రాధాన్యత వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈఈ ఆశీర్వాదం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పథకమైన సూర్యఘర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటు చేసుకుంటే సోలార్ విద్యుత్ వినియోగం వల్ల చార్జీలు గణనీయంగా తగ్గుతాయన్నారు. సోలార్ పవర్ ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు, నాగలాపురం డీఈఈలు శంకరయ్య, రమేష్, ఏఈలు జైసాయి, రవి కుమార్, రైతులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో 120మంది ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో అధ్యాపక బృందం

-ఉద్యోగాలు పొందిన పాలిటెక్నిక్ ఫైనలియర్ విద్యార్థులు

పుత్తూరు: పట్టణంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులందరూ క్యాంపస్ సెలెక్షన్స్‌లో ప్లేస్‌మెంట్ సాధించడం తమ కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ ఎస్వీకుమార్ అన్నారు. మంగళవారం కళాశాలలో జాబ్ అచీవర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తమ విద్యార్థులు దిగ్గజ కంపెనీలైన విప్రో, ఇండో ఎంఐఎం, గ్రీన్ టెక్ వంటి వాటిలో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా లేబర్ అసిస్టెంట్ కమిషనర్ చిన్నలాలెప్ప మాట్లాడుతూ, తాము చదువుకునే రోజుల్లో చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం పలు కంపెనీల చుట్టూ తిరిగేవాళ్లమని జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం కంపెనీ యాజమాన్యాలే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించి ఉద్యోగాలను ఇస్తున్నాయని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతరం ఎంపికైన 120 మంది విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు కిషోర్‌కుమార్, వేలాయుధ ఆచ్చారి, అమర్నాథ్, సుగుణ, జయచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు ఎవరి కోసం?


మండలంలోని పన్నూరు సచివాలయానికి కూతవేటు దూరంలో వారం క్రితం రూ. 2లక్షలతో అధికారులు సిమెంట్ రోడ్డు వేశారు. అక్కడ ఇల్లు లేదు..ప్రభుత్వం కార్యాలయమూ లేదు..కేవలం పన్నూరుకు చెందిన ఓ టీడీపీ నాయకుడుకి దోచిపెట్టడం కోసమే అధికారులు సీసీ రోడ్డు వేశారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ప్రజల సొమ్మును సీసీ రోడ్ల పేరిట ఇలా సంతర్పణ చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

\- విజయపురం

బంగారం, వెండి చోరీ

నాగలాపురం: తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగలగొట్టి బంగారం, వెండి, నగదు చోరీ చేసిన ఘటన పిచ్చాటూరు మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశులు కథనం మేరకు.. సిద్ధిరాజుకండ్రిగకు చెందిన శంకర్‌రాజు అనారోగ్యంతో ఈ నెల 21వ తేదీన తిరుపతిలోని తన కొడుకు వద్ద ఉంటామని వెళ్లాడు. మంగళవారం ఉదయం స్థానికులు శంకర్‌రాజుకు ఫోన్ చేసి మీ ఇంటి తాళాలు తెరిచి ఉన్నాయని సమాచారం ఇచ్చారు. వెంటనే శంకర్ రాజు తిరుపతి నుంచి సిద్ధిరాజుకండ్రిగలోని తన ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలోని 10 తులాల బంగారం, 4.5 కిలోల వెండి, 10 వేలు నగదు, 250 యూఎస్ డాలర్లు, 170 మలేసియా రింగ్స్ చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశులు తెలిపారు.


చోరీ జరిగిన శంకర్ రాజు ఇల్లు

ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

పుత్తూరు: 2024–25 ఆర్థిక ఏడాదికి సంబంధించి ఆస్తి పన్ను బకాయి మొత్తాన్ని ఈనెల 31వ తేదీ లోపు చెల్లించినట్లయితే వడ్డీపై 50 శాతం రాయితీ పొందవచ్చునని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఇది వరకే చెల్లించిన ఆస్తి పన్నుల వడ్డీని 2025–26 ఆర్థిక ఏడాదిలో సర్దుబాటు చేయనున్నట్టు తెలిపారు. ఇంటి, నీటి, ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సెలవు దినాలైన ఆదివారాల్లో సైతం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ సీడీఎంఏ వెబ్‌సైట్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చన్నారు.

వైద్యురాలిని మోసం చేసి రూ.60 లక్షలు స్వాహా!

నాయుడుపేట టౌన్: నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలికి అధునిక వైద్య పరికరాలను ఇస్తామని చెప్పి ఆమె వద్ద నుంచి రూ.60 లక్షలు స్వాహా చేసిన వ్యక్తిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్ వీధిలో నివాసం ఉంటున్న వి.సత్యనారాయణ నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలు బిందు మీనన్‌కు ఇతర ప్రాంతాల నుంచి అత్యాధునిక వైద్య పరికరాలను తీసుకొచ్చి ఇస్తామని నమ్మబలికాడు. తక్కువ ధరకే లక్షలు విలువ చేసే పరికరాలను ఇస్తామని చెప్పడంతో ఈ నెల 21వ తేదీ సత్యనారాయణకు వైద్యురాలు రూ.60 లక్షలు నగదు ఇచ్చింది. అయితే పరికరాలు పంపక పోవడంతో ఈవిషయమై సత్యనారాయణను నిలదీసింది. అయితే సత్యనారాయణ ఆమెను బెదరించడంతో ఖంగుతింది. నగదు విషయమై అడిగేందుకు వైద్యురాలు రెండు రోజుల కిందట నాయుడుపేటకు వచ్చి తన వద్ద తీసుకున్న నగదు ఇచ్చేయాలని కోరింది. నగదు ఇవ్వకపోగా సత్యనారాయణ ఆమెపై దౌర్జన్యం చేయడంతో మంగళవారం వైద్యురాలు నాయుడుపేట సీఐ బాబిని కలిసి మోసం చేసిన వైనంపై ఫిర్యాదు చేసింది. మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని మంగళవారం రాత్రి గూడూరు కోర్టు న్యాయమూర్తి వద్ద హాజరు పెట్టి రియాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

శ్మశానానికి ప్రభుత్వ భూమి గుర్తింపు


ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం: మండలంలో శ్మశానం లేని గ్రామాలకు ప్రభుత్వ భూమిని గుర్తించి కేటాయిస్తామని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. మంగళవారం తన సిబ్బందితో కలసి తహసీల్దార్ గంగమాంబపురం, నరసింహపురం పంచాయతీల్లో పర్యటించారు. శ్మశానానికి ప్రభుత్వ భూమిని గుర్తించి మాట్లాడారు. శ్మశానం లేని గ్రామాల జాబితాను తీసుకుని సమీపంలోన ప్రభుత్వ భూములను సర్వే చేయాలని గ్రామ సర్వేయర్లను ఆదేశించారు. శ్మశానానికి దారి కూడా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గణేష్, ఎమ్ఆర్ఐ దేవి, వీఆర్ఓ శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వడమాలలో పారిశుధ్యం మెరుగు


మురుగు కాలువలో తీసిన పూడిక

వడమాలపేట (విజయపురం): మండలంలోని వడమాలలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం పారిశుధ్యం మెరుగు పరిచారు. మురుగు కాలువల్లో పూడిక తీయించి, ఆయిల్ బాల్స్ వేయించారు. అలాగే పేడదిబ్బలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. చేశారు. పొడి, తడి చెత్తను వేరు చేసి, ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని గ్రామస్తులను కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నగరి: అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలా అప్రమత్తంగా బయటపడాలి? అనే అంశంపై మంగళవారం మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

–సీడీపీఓ వినుతశ్రీ, ఎంఈఓ గిరిజ


మాట్లాడుతున్న సీడీపీఓ వినుతశ్రీ

పాలసముద్రం : అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ టీచర్లు నేర్పించాలని సీడీపీఓ వినుతశ్రీ, ఎంఈఓ గిరిజ ఆదేశించారు. మంగళవారం ఎంఆర్సీ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ ప్రారంభించారు. సీడీపీఓ, ఎంఈఓ మాట్లాడారు. శిక్షణ ఉద్దేశాలను వివరించారు. శిక్షణానంతరం కేంద్రాల్లో సమర్థవంతంగా విద్యాబోధన చేయాలన్నారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దళితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి : మున్సిపల్ పరిధి తొమ్మిదవ వార్డు నెత్తం కండ్రిగ దళితవాడ వాసులు నివాసం ఉంటున్న స్థలాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని ఎపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 ఏళ్లుగా పూరిళ్లలో సుమారు 80 కుటుంబాలు ఇక్కడ ఉంటున్నాయని, వీరు ఉంటున్న స్థలాలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని ఎన్నోసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని నిరసించారు. అర్హులైన వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌తో బుధవారం నగరి ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు యేసయ్య, మధుబాబు, సురేష్, మహేంద్ర, మధు, సుబ్బమ్మ, రాసాత్తి, కాంచన, రాణి, కుందెమ్మ, బిందు తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

27న వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక

- విజయపురం: మండలంలో ఖాళీగా ఉన్న సెకండ్ వైస్ ఎంపీపీ పదవికి ఈ నెల 27న ఉదయం 11గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నామని ఎంపీడీఓ రాజేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఎన్‌ఆర్‌జీఎస్ గ్రామసభ

- వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామీణ ఉపాధి హామీ బహిరంగ గ్రామసభ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శేషగిరిరావు మంగళవారం తెలిపారు. ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

విజయపురంలో ..

- విజయపురం మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10గంటలకు గ్రామీణ ఉపాధి హామీ బహిరంగ గ్రామసభ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రాజేంద్ర తెలిపారు. 2023–24 మధ్య చేసిన ఉపాధి హామీ పనులపై సమీక్షించనున్నట్టు చెప్పారు.

డిజిటల్ గుర్తింపు కార్డు ఉంటేనే పథకాల లబ్ధి

వడమాలపేట (విజయపురం): డిజిటల్ గుర్తింపు కార్డు ఉంటేనే రైతులకు పథకాల లబ్ధి చేకూరుతుందని వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలో ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (కార్డు) ఇవ్వాలని రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వడమాలపేట మండలంలో 74.5 శాతం నమోదు ప్రక్రియ చేశామని, ఈ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పథకాలకు అర్హత పొందుతారన్నారు. ఇంకనూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందని రైతులు ఈ నెలాఖరు లోపు స్థానిక రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

నివాళి


లోహిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కుమారస్వామి రెడ్డి

నగరి : మండలంలోని ఎం.కొత్తూరుకు చెందిన వైస్సార్‌సీపీ నేత, రూరల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ దామునాయుడు కోడలు లోహిత ఆకస్మికంగా మరణించింది. ఇది తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు కుమారస్వామి రెడ్డి మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి లోహిత భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దామునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు ముఖ్యం


రేణిగుంటలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వడమే విధులు నిర్వర్తించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను ,కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. అలాగే గర్భవతులను, బాలింతలను వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం వైద్యసిబ్బందితో సమీక్షించారు. గర్భధారణ–సంరక్షణ, ప్రసవం తర్వాత తల్లీబిడ్డ సంరక్షణ, యుక్త వయస్సులో జాగ్రత్తలపై స్త్రీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి కోసం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య పథకాలను వివరించారు. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు తీస్కోవాల్సిన జాగ్రత్తలపై మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డీపీఓ ప్రకాష్, సీహెచ్ ఓ హైమావతి, సూపర్‌వైజర్ నరేష్, ఎంపీహెచ్ఎస్ అనూరాధ, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.